**కథ**

# ఈ పాపం ఎవరిది?

**సి.ఎన్.చంద్రశేఖర్**

"నాన్నా, జాగ్రత్తగా వెళ్ళి రాగలరా?" ప్రభాకర్ తండ్రిని అడిగాడు.

"ఏమిట్రా క్రొత్తగా మాట్లాడుతున్నావు? ఎన్నిసార్లు రైళ్ళల్లో ప్రయాణం చేయలేదు నేను" రామయ్య అన్నాడు.

"ఇదివరకటి సంగతి వేరు నాన్నా. ఈమధ్య ప్రయాణాల్లో టెన్షన్ ఫీలవుతున్నారు కదా"

"అది రద్దీ బస్సుల్లోరా. ఇక్కడ అలాంటి యిబ్బంది లేదు. పైగా రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్. రాత్రి ట్రైను కాబట్టి కమ్యూటర్లు ఎక్కువగా ఉండరు. ఇంకో గంట కూర్చుని నడుం వాలిస్తే ఉదయం నిద్రలేచేసరికి తిరుపతిలో ఉంటాను"

"తిరుపతి చేరగానే నాకు ఫోన్ చేయడం మరచిపోకండి"

"అలాగే. ఇక నువ్వు బయలుదేరు ప్రభా. బస్సెక్కి నువ్వు ఇల్లు చేరేసరికి పది గంటలవుతుంది. భోజనం చేసి పడుకునేసరికి పదకొండవుతుంది. మళ్ళీ ఉదయాన్నే లేస్తేగాని పనులు కావు. ఇంకో పది నిమిషాల్లో ట్రైను బయలుదేరుతుంది. నువ్వు ఊరికే ఆలస్యం చేసుకోకు. వెళ్ళు" అన్నాడు రామయ్య.

వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మరికొంతసేపట్లో బయలుదేరనుందని అనౌన్స్‌మెంట్ వినిపించింది. ప్రభాకర్ లేచి తండ్రి చేయి పట్టుకుని మృదువుగా నొక్కి వదిలాడు. తర్వాత ప్లాట్‌ఫారం మీదికి వచ్చి "జాగ్రత్త నాన్నా. ఉంటాను గుడ్‌నైట్" అన్నాడు.

రామయ్య చెయ్యి ఊపాడు.

ప్రభాకర్‌కు అక్కడి నుంచి కదలాలనిపించలేదు. మనసులో ఏదో బాధ, ఆందోళన. 'నాన్న ఎలాంటి యిబ్బంది లేకుండా పన్నెండు గంటలు ప్రయాణం చేయగలడా? అసలు ఈ ప్రయాణాన్ని కాన్సిల్ చేసి హైదరాబాదులోనే ట్రీట్‌మెంట్ యిప్పిస్తే! తర్వాత తనకు లీవు దొరికినప్పుడు ఆయన్ను తిరుపతికి తీసుకెళ్ళి అన్నయ్య ఇంట్లో దిగవిడిచి రావచ్చు' అనుకున్నాడు.

వెంటనే తండ్రిని సమీపించి తన మనసులోని మాటను చెప్పాడు.

"నువ్వు మరీ యింత సెన్సిటివ్ అయితే ఎలారా? నేను వెళ్ళగలను అంటున్నానుగా. పైగా నేను వెళ్ళకుంటే అక్కడ అన్ని ఏర్పాట్లూ చేసుకుని నాకోసం ఎదురుచూస్తున్న సుధ బాధపడతాడు. నువ్వు ముందు యిక్కడ్నుంచి వెళ్ళు. ఇంకాసేపు ఉంటే నన్ను ట్రైన్నుంచి దింపేసేలా వున్నావు" అన్నాడు రామయ్య నవ్వుతూ.

ప్రభాకర్ కూడా నవ్వి "సరే నాన్నా! ఉంటాను" అని చెయ్యూపి వెళ్ళిపోయాడు.

రామయ్య తన కొడుకుల గురించి ఆలోచిస్తూ ఉండిపోయాడు. వారి అభిమానాన్ని తలచుకుంటూంటే అతని కళ్ళలో నీరు తిరిగింది. అందరు బిడ్డలూ తన కొడుకుల్లా ఉంటే ఏ తండ్రికీ, ఏ తల్లికీ వృద్ధాశ్రమాల్లో చేరే అవసరం ఉండదు కదా అనుకున్నాడు.

ooo

రామయ్య పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి రిటైరయ్యారు. అతను రిటైరైన కొద్దిరోజులకే అతని భార్య చనిపోయింది. పెద్దకొడుకు సుధాకర్ తిరుపతిలో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. చిన్నకొడుకు ప్రభాకర్ చిరుద్యోగి కావడంతోపాటు హైదరాబాదులాంటి సిటీలో కాపురం కాబట్టి రామయ్య అతని దగ్గరే ఉంటూ తన పెన్షన్‌తో అతని చిన్న చిన్న అవసరాలు తీరుస్తూ కాలం గడుపుతున్నాడు.

ఈమధ్యనే అతనికో క్రొత్త జబ్బు పట్టుకుంది. ఓసారి సిటీబస్‌లో నిలబడి ప్రయాణం చేస్తున్నాడు. అందరూ ఆఫీసుల నుంచి, కాలేజీల నుంచి ఇండ్లకు చేరే సమయం. బస్సులో క్రిక్కిరిసిన జనం. బస్సు ప్రతి స్టాపులో ఆగుతూంది. జనం ఎక్కుతూనే ఉన్నారు. ఇరుప్రక్కల నుంచి అతని మీద ఒత్తిడి. చాలా యిబ్బందిగా ఫీలవసాగాడు. ఉన్నట్టుండి శ్వాస బరువుగా ఆడసాగింది. ఊపిరి తీసుకోవడం కష్టంగా అనిపించసాగింది. క్షణక్షణానికీ ఆందోళన పెరగసాగింది. ఇక భరించలేక 'స్టాప్..స్టాప్' అని గట్టిగా అరిచాడు. బస్సు కీచుమని శబ్దం చేసుకుంటూ ఆగింది. అందరూ ఆశ్చర్యంగా అతనివైపే చూడసాగారు. అతను జనాన్ని చీల్చుకుంటూ బయటపడ్డాడు. బస్సు దిగగానే అంతవరకూ ఉన్న ఆందోళనలు మాయమయ్యాయి. శ్వాస బాగా ఆడసాగింది. ఆటో ఎక్కి ఇల్లు చేరాడు. అయితే తనకు కలిగిన అనుభవాన్ని అతను ఇంట్లో ఎవరికీ చెప్పలేదు.

తర్వాత కూడా సిటీబస్సులో అలాంటి అనుభవమే ఎదురైంది అతనికి. అప్పట్నుంచీ రద్దీగా ఉండే సమయాల్లో బస్సుల్లో ప్రయాణించడం మానుకున్నాడు. ఎక్కడికైనా వెళ్ళవలసి వస్తే ఉదయాన్నే బయలుదేరి ఏనిమిదిలోగా ఇల్లు చేరుకోవడం లేదా పన్నెండు తర్వాత బయలుదేరి మూడు గంటల్లోపు ఇల్లు చేరుకోవడం అలవాటు చేసుకున్నాడు. రద్దీగా ఉన్న బస్సులవైపు చూస్తుంటేనే అతనికి ఊపిరి ఆగిపోయినట్లనిపించేది.

ఓ రోజు ప్రభాకర్‌తో విషయం చెప్పి, "ఈ వయసులో నాలుగు చోట్ల తిరిగితే నాకు కాలక్షేపం అవుతుంది. లైబ్రరీకి, ఎక్కడైనా ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఉంటే వినడానికి, ఇంటి కరెంటు బిల్లు, టెలిఫోన్ బిల్లు కట్టడానికి బయటకు వెళుతూంటాను. బస్సులో వెళుతూంటే ఈ మధ్య యీ సమస్య ఎదురైంది. ఆటోల్లో వెళ్ళేంత ఆర్థిక స్థోమత మనకు లేదు. ఇంట్లోనే కూర్చుంటే సమయం గడవదు. ఏం చేయాలో నాకు తోచడం లేదు" అన్నాడు.

"ఇదేం పెద్ద సమస్య కాదు నాన్నా. చిన్న ఇబ్బంది. మంచి సైకియాట్రిస్టును కన్సల్ట్ చేద్దాం. ఈమధ్యే మొదలైంది కాబట్టి త్వరగా నయమవుతుంది" అన్నాడు ప్రభాకర్.

తర్వాత పెద్దకొడుకు సుధాకర్ ఫోన్ చేసినప్పుడు తన సమస్య గురించి చెప్పాడు.

"నాకు తెలిసిన మంచి సైకియాట్రిస్ట్ తిరుపతిలో ఉన్నాడు. అతను నాకు మంచి స్నేహితుడు కూడా. మీరు వెంటనే బయలుదేరి వచ్చెయ్యండి. నేను మిమ్మల్ని అతని దగ్గరికి తీసుకెళతాను. పైగా మీరు మా ఇంటికి వచ్చి రెండేళ్ళవుతూంది. ఈ సాకుతోనైనా మీరు మాతో కొద్దిరోజులు ఉన్నట్లుంటుంది" అన్నాడు సుధాకర్.

తన పట్ల కొడుకు చూపుతున్న ప్రేమకు చలించిపోయాడు రామయ్య. తర్వాత ప్రభాకర్‌తో సుధాకర్ తనతో మాట్లాడిన విషయం చెప్పి "నువ్వు ఉదయం ఎనిమిది గంటలకు ఆఫీసుకు బయలుదేరితే ఇంటికి తిరిగొచ్చేసరికి రాత్రి తొమ్మిదవుతుంది. నా కోసం ఓ రోజు లీవు పెట్టి డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళినా మళ్ళీ మళ్ళీ వెళ్ళాలంటే అన్ని రోజులు నీకు లీవు దొరక్కపోవచ్చు. పైగా చాలామంది డాక్టర్లు సాయంత్రాలే క్లినిక్‌లో ఉంటారు. ఆ సమయాల్లో బస్సుల్లో రద్దీగా ఉంటుంది. ఆటోలకు వందలకొద్దీ ఖర్చవుతుంది. కాబట్టి వాడి దగ్గరికెళ్ళి అక్కడే ట్రీట్‌మెంట్ తీసుకుంటాను. నువ్వు చిన్నబుచ్చుకోకు. మీరిద్దరూ నాకు రెండు కళ్ళు. రెండు కళ్ళూ నాకు సమానమే" అన్నాడు.

"అలాగే నాన్నా. అన్నయ్యతో మాట్లాడి నీకు టికెట్ రిజర్వు చేయిస్తాను" అన్నాడు ప్రభాకర్.

తృప్తిగా నిట్టూర్చాడు రామయ్య.

ooo

"మీది మిడిల్ బెర్తా? లోయర్ బెర్తా?"

అప్పుడే ట్రైనులో అడుగుపెట్టి తన ఎదురు బెర్తులో కూర్చుంటున్న పొడవాటి వ్యక్తి ప్రశ్న విని ఆలోచన ల్లోంచి బయటికొచ్చాడు రామయ్య.

"నాది మిడిల్ బెర్తండీ" అన్నాడు అతని ప్రశ్నకు సమాధానంగా.

"అయితే వెంటనే బెర్తు పరచుకుని పడుకోండి. ఆలస్యం చేస్తే కూర్చునే స్థలం కూడా ఉండదు మీకు"

"ఎందుకు?" భయంగా అడిగాడు రామయ్య.

"జనమండీ జనం. ఏదో రాజకీయ పార్టీ మీటింగ్ కని జనాన్ని లారీల్లో, బస్సుల్లో తోలుకుని వచ్చారు. మీటింగ్ అయిపోయింది. నాయకులు తోలుకొచ్చిన జనం సంగతి మరచిపోయారు. వాళ్ళు రిజర్వ్డ్, అన్ రిజర్వ్డ్ అన్న తేడా లేకుండా అన్ని కంపార్ట్‌మెంట్లలో ఎక్కేస్తున్నారు. మీరు బెర్తు పరచుకోండి మేస్టారూ"

రామయ్యలో ఆందోళన మొదలైంది. ఒంట్లో శక్తంతా లాగేసినట్లు నిస్సత్తువగా కూర్చుండిపోయాడు.

పొడవాటి వ్యక్తి తెల్లటి పైజమా, జుబ్బా ధరించి ఉన్నాడు. వయసు యాభై ఏళ్ళు ఉండవచ్చు. చూడటా నికి మంచివాడిలాగే ఉన్నాడు. లేకుంటే తన గురించి తపన పడాల్సిన అవసరం అతనికి ఏం ఉంది? అనుకు న్నాడు రామయ్య.

రామయ్య బెర్తు పరచుకోవడానికి ఏ ప్రయత్నం చేయకపోవడం చూసి "ఏమిటి మేస్టారూ ఆరోగ్యం బాగా లేదా? నేను సహాయం చేయనా?" అని అడిగాడ తను.

"నేను ట్రైను దిగుతాను" లేచి నిలబడి అన్నాడు రామయ్య.

"అదేం మీరు టికెట్టు కొనలేదా?" ఆశ్చర్యంగా అడి గాడు పొడవాటి వ్యక్తి.

"కొన్నాను"

"మరి..దిగేస్తానంటారే?"

"సైకలాజికల్ ప్రాబ్లమ్ రష్‌లో ప్రయాణం చేయ లేను"

"మరి మీ ప్రయాణం?"

"ఇంకో రోజు బయలుదేరు తాను"


"ఆ రోజూ మీటింగ్ ఉండదని గ్యారంటీ ఏమిటి? జనం ఉండరని నమ్మకం ఎక్కడిది? అసలు మన దేశంలో పొలిటికల్ మీటింగ్ లేని రోజు ఎప్పుడో చెప్పండి? హైదరాబాదులో కాకపోతే కర్నూలులో లేదా కడపలో లేదా మరో ఊరిలో.. ఇదే జనం కర్నూ లులో ఎక్కి ఉంటే ట్రైను దిగి అర్ధరాత్రి ఎక్కడికి పోయే వారు మీరు? కాస్త ధైర్యం తెచ్చుకోండి మేస్టారూ. ఇబ్బంది ఉంది. కాదనను. కానీ ప్రాణం తీసే యిబ్బంది కాదిది" అన్నాడు పొడుగాటి వ్యక్తి.

ఇంతలో జనం కల కలం దగ్గరైంది. జనం కంపార్ట్‌మెంట్లో ఎక్క సాగారు. రామయ్య ప్రక్కన ఆరుగురు యిరుక్కుని కూర్చు న్నారు. క్షణాల్లో కంపార్ట్‌మెంట్ నిండి పోయింది. బెర్తుల మధ్యలో మనుషులు, నడిచే దారిలో మనుషులు.

రామయ్యలో ఆందోళన క్షణక్షణానికీ పెరగసాగింది. ఉన్న ట్టుండి శ్వాస పీల్చుకోవడం కష్టంగా అనిపించసాగింది. అర్జెంటుగా బాత్ రూమ్‌కు వెళ్ళాలనిపించింది. అయితే బాత్‌రూమ్ వరకూ కాదు కదా రెండు అడు గులు కూడా ముందుకు కదలలే నని అనిపించింది. అతనికి, అక్క డున్న జనం చూస్తూంటే 'చాలా సేపట్నుంచి యూరినల్స్‌కు వెళ్ళాల్సి ఉంది, ట్రైను కదిలాక వెళ్దాంలే అనుకుని ప్రభాకర్‌తో మాట్లా డుతూ ఉండిపోయాడు. అప్పుడే వెళ్ళి వచ్చుంటే బాగుం డేది' అనుకున్నాడు.

పొడవాటి వ్యక్తి రామయ్య ప్రక్కన కూర్చున్న వాళ్ళతో సంభాషణకు దిగాడు.

"ఎక్కడికి వెళ్ళాలయ్యా మీరు?"



"కడపకు"

వారి సమాధానం విన్న రామయ్య ఆశ్చర్యంతో నోరు తెరిచాడు. 'వాళ్ళు ఏ ఫలక్‌నుమా వరకో, కర్నూలు వరకో తమతో ప్రయాణిస్తారనుకున్నాడు. కడప వరకూ ప్రయాణమంటే దాదాపు పదిగంటలు పడుతుంది. అంతసేపు ఈ జనం మధ్య కదలలేక, మెదల్లేక, బాత్‌రూమ్‌కు పోలేక ఉండగలడా?' అనుకున్నాడు.

రిజర్వేషన్ లేనివాళ్ళు జనరల్ కంపార్ట్‌మెంట్లలో ప్రయాణించాలని, రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్లో ప్రయాణిస్తే జరిమానా ఉంటుందని రైల్వేస్టేషన్ మైకుల్లోంచి అనౌన్స్‌మెంట్ వినిపిస్తూంది. అయితే ఆ అనౌన్స్‌మెంట్‌ను ఎవరూ పట్టించుకోవడం లేదు.

రామయ్య టి.టి.ఇ.గాని, పోలీసులు గాని కనబడతారేమోనని కిటికీలోంచి చూశాడు. కనుచూపుమేరలో ఎవరూ కనిపించలేదు.

"ఏం చెప్పారయ్యా మీ నాయకులు?" పొడవాటి వ్యక్తి అడిగాడు రామయ్య ప్రక్కన కూర్చున్న వాళ్ళను.

వాళ్ళు తెల్లముఖం వేసుకుని చూశారు అతనివైపు.

"ఎంతమంది వచ్చారు మీటింగుకి?"

"లక్షకు పైగా వచ్చుంటారు"

"లక్షెక్కడ? రెండు లక్షల మంది వచ్చుంటారు" ప్రక్కనున్న మరొకతను అన్నాడు.

"మీకు ఎంత యిచ్చారు?"

"మనిషికి రెండు వందలు"

"రెండు లక్షల మందికి రెండు వందలు చొప్పున యిలా మీటింగ్ పెట్టి మిమ్మల్నందరినీ తరలించుకు రావడానికి మీ నాయకులకు ఎంత డబ్బు ఖర్చయి ఉంటుంది? ఎంత పెట్రోలు, ఎంత డీజిలు ఖర్చయి ఉంటుంది? రెండు లక్షల మంది తమ పనులు మానుకుని మీటింగ్‌కు వచ్చినందువల్ల రెండు లక్షల పని దినాలు వృధా కదా. వ్యక్తిగతంగా మీకూ నష్టమే. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికీ దెబ్బే. పోనీ వచ్చి మీరేమైనా కొత్త విషయాలు నేర్చుకున్నారా అంటే అదీ లేదు, యిలాంటి వయసు మళ్ళిన వాళ్ళకు యిబ్బంది కలిగించడం తప్ప" రామయ్యను చూపిస్తూ అన్నాడు.

"ఏమైంది ఆయనకు?" ఓ కుర్రాడు అడిగాడు.

"ఏదో మానసిక జబ్బు. రష్‌లో ప్రయాణించాలంటే యిబ్బంది"

"అయితే బస్సులో వెళ్ళమనండి" నవ్వుతూ అన్నాడు ఆ కుర్రాడు.

"అందులో కూడా మీరంతా ఎక్కరని గ్యారంటీ ఏమిటి?" రామయ్య ఎదురు బెర్తులోని యువకుడు అన్నాడు. తను రిజర్వు చేయించుకున్న బెర్తుమీద మరో ఆరుగురు కూర్చోవడంతో చిర్రుబుర్రులాడుతున్నాడు అతను.

"అవును. ఎక్కుతాం. ఇవన్నీ గవర్నమెంటు బండ్లు. అంటే మనందరివీ"

"నిజమే. కానీ వాటికీ రూల్స్ ఉన్నాయి. టికెట్స్ తప్పనిసరిగా కొనాలి. రిజర్వేషన్ లేనివాళ్ళు జనరల్ కంపార్ట్‌మెంట్ ఎక్కాలి"

"అది నిండిపోయింది"

"అయితే ఏ లారీల్లోనో వెళ్ళాలి. ఎలాంటి యిబ్బందీ లేకుండా ప్రయాణించాలని నెలరోజుల ముందు రిజర్వు చేయించుకున్నాను నేను. బెర్తుకు అదనంగా డబ్బులు చెల్లించాను. మీరు రూల్స్ పాటించకపోవడం వల్ల మాకు యిబ్బంది కలుగుతూంది. గాలి రావడం లేదు. కదిలే చోటు లేదు. కనీసం బాత్‌రూమ్‌కు పోవడానికి కూడా దారి లేకుండా చేస్తున్నారు మీరు"

"అయితే యిప్పుడేం చేయమంటావు?" మీదికొస్తూ అన్నాడు ఆ కుర్రాడు.

వెంటనే పొడుగు వ్యక్తి కల్పించుకుంటూ "నువ్వేం చేయనక్కరలేదు. కూర్చో చెబుతాను. మీ నాయకులు మీకు యివ్వాల్సిన సందేశాన్ని తయారు చేసుకుని, ముందే ఓ తేదీ, సమయం నిర్ణయించుకుని, ఏదో ఒక ఛానల్‌తో ఒప్పందం కుదుర్చుకుని, టీవీలో తమ సందేశం వినిపిస్తే రెండు లక్షల మంది కాదు, ఇరవై లక్షల మంది చూస్తారు, వింటారు. ఆ తేదీ, సమయం గురించి విస్తృతంగా ప్రచారం చెయ్యనీ. దీనివల్ల ఎంత సమయం ఆదా అవుతుంది, ఎంత ఇంధనం ఆదా అవుతుంది, మీలాంటి కార్యకర్తలకు ఎంత శ్రమ తగ్గుతుంది?"

ఆ మాట నిజమేనన్నట్టు అక్కడున్న వాళ్ళందరూ



## నవదీప్‌కి మంచిరోజులు

'జై' సినిమా ద్వారా పరిచయమైన యువహీరో నవదీప్‌కి ఆ సినిమా ఫ్లాప్ అయినా కూడా ఆఫర్లు వచ్చిపడ్డాయి. కానీ వరసగా అన్నీ పరాజయాలే చవిచూసాయి. 'గౌతమ్ ఎస్.ఎస్.సి' హిట్ తప్ప మినహా దాదాపు అన్నీ ఫ్లాపులే. దీంతో రాక రాక వచ్చిన మంచి చాన్స్ 'చందమామ' మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడతను. అతని ఆశల్ని నిజం చేస్తూ ఇప్పుడా సినిమాకి మంచి పేరు రావడంతో తిరిగి నిర్మాతల దృష్టిలో పడ్డాడు నవదీప్. అయితే ఈసారి ఏ సినిమాబడితే అది ఒప్పేసుకోకుండా ఆచితూచి అడుగేయాలని నవదీప్ నిర్ణయించుకున్నాట్ట.

తలలూపారు.

ఇంతలో కంపార్ట్‌మెంట్‌లో మళ్ళీ గొడవ మొదలైంది. ఎవరో ప్యాసింజరు తన బెర్తుపై మరొకరు కూర్చోవడానికి అభ్యంతరం చెప్పినట్లుంది. మగ వాళ్ళూ, ఆడవాళ్ళూ గోలగోలగా అరుస్తున్నారు.

రామయ్యకు మళ్ళీ ఆందోళన మొదలైంది. శ్వాస తీసుకోవడం కష్టంగా అనిపించసాగింది. ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. అతనికి యిక తను ప్రయాణం చేయలేదనిపించింది. గబగబా తన బ్యాగు భుజానికి తగిలించుకుని "జరగండి..జరగండి" అంటూ ముందుకెళ్ళడానికి ప్రయత్నించసాగాడు. అయితే ఎవరూ తమ స్థానాల్లోంచి కదలలేదు. అతనికి దారివ్వలేదు.

గార్డు విజిల్ వినిపించింది. రామయ్య భయంతో అరుస్తున్నాడు. పొడవాటి వ్యక్తి అతనివైపు ఆశ్చర్యంగా చూడసాగాడు.

"నాకు గుండె నొప్పిగా ఉంది. నేను దిగేస్తాను. ప్లీజ్. దారివ్వండి నాకు" వేడుకుంటున్నాడు రామయ్య.

"ట్రైను కదలబోతోంది ముసలోడా. దిగావంటే ట్రైను కింద పడి ఛస్తావు" ఓ కుర్రాడు నవ్వుతూ అన్నాడు. అతని చుట్టూ ఉన్నవాళ్ళు నవ్వారు.

ఇంతలో ట్రైను కదిలింది.

"నేను దిగాలి. చైను లాగండి" గట్టిగా అరవసాగాడు రామయ్య.

"ఫైను నువ్వు కడతావా? నువ్వు కడతానంటే లాగుతా. వద్దులే. తీరా వాళ్ళొచ్చాక నేనే లాగానని అందరూ సెబుతారు. అప్పుడు నేను ఫైను కట్టాల అంత దబ్బు నాకాడ లేదు" అన్నాడు మరొకడు.

మళ్ళీ అందరూ నవ్వారు.

ఉన్నట్టుండి రామయ్య క్రింద పడిపోసాగాడు.

"అయ్యా, పట్టుకోండి ఆయన్ను" పొడవాటి వ్యక్తి అరిచాడు. ఇద్దరు క్రింద పడకుండా పట్టుకున్నారు. పొడవాటి వ్యక్తి చైను లాగాడు. రామయ్యను మోసుకొచ్చి ప్లాట్‌ఫారం మీద ఓ బెంచీపై పడుకోబెట్టారు. ఒకరు నీళ్ళు చల్లారు అతనిపైన.

○○○

"హాయ్ ప్రభా. ఊరికెళ్తున్నావా?" తన స్నేహితుడు విజయ్‌తో మాట్లాడుతున్న ప్రభాకర్‌ను సాగర్ పలకరించాడు.

"లేదు. నాన్న తిరుపతి వెళ్తాంటే ట్రైను ఎక్కించడానికి వచ్చాను. స్టేషన్ బయట వీడు కనబడి తను ముంబయి వెళ్తున్నానని, ట్రైను కదిలేవరకూ కంపెనీ యివ్వమని లోపలికి లాక్కొచ్చాడు. మా నాన్న నన్ను త్వరగా ఇల్లు చేరుకొని భోంచేయమంటే వీడు నన్ను భోంచేస్తున్నాడు. అదే తండ్రికీ, స్నేహితుడికీ తేడా" అన్నాడు ప్రభాకర్ నవ్వుతూ.

"ఏమిటి ఆ ప్లాట్‌ఫారం దగ్గర గొడవగా ఉంది" విజయ్ సాగర్‌ని అడిగాడు, అతను అటునుంచే వచ్చాడు కాబట్టి విషయం తెలిసి ఉంటుందనే ఉద్దేశ్యంతో.

"ఎవరో ముసలాయన పడిపోయాడట"

"ట్రైను క్రిందా?" భయంగా అడిగాడు ప్రభాకర్.

"కాదు ట్రైనులోనే. సిటీలో ఏదో రాజకీయ పార్టీ మీటింగ్‌కని జనాల్ని లారీల్లో తోలుకొచ్చారు. మీటింగ్ అయ్యాక వాళ్ళనెవరూ పట్టించుకోలేదు. వాళ్ళు ట్రైనంతా నిండిపోయారు. ఆ ముసలాయనకు ఏదో సైకలాజికల్ ప్రాబ్లమ్ ఉన్నట్లుంది. రద్దీలో ఊపిరాడక చనిపోయాడట"

వింటున్న ప్రభాకర్ గుండె చెదిరింది. వెంటనే అతను ఆ గుంపువైపు పరుగెత్తసాగాడు ట్రాక్‌లు దాటుకుంటూ. గుంపు చీల్చుకుని ముందుకు దూసుకొచ్చిన అతనికి తండ్రి మృతదేహం కనిపించింది.

"నాన్నా" అంటూ భోరున విలపించసాగాడు.

ప్లాట్‌ఫారం మీద రైల్వే వాళ్ళు ఏర్పాటు చేసిన టీవీలలో వార్తలు ప్రసారం కాసాగాయి.

"ఈరోజు జరిగిన బహిరంగ సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచీ లక్షలాది ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి పాల్గొన్నారని, సభ విజయవంతమైందని, తమ పార్టీకి పెరుగుతున్న ప్రజాభిమానానికి యిది నిదర్శనమని ఆ పార్టీ నాయకులు చెప్పారు"

○

## సర్దుకుపోతే సరి!

డింపుల్ కపాడియా-రాజేష్ ఖన్నాల కూతురు ట్వింకిల్ ఖన్నా దాదాపు ఏడేళ్ల క్రితం అక్షయ్ కుమార్‌ని పెళ్లాడి సినిమాలకు గుడ్‌బై చెప్పేసింది. ఆమధ్య కొంత కాలంగా వీరి కాపురంలో చిచ్చు ఏదో రగిలిందని విడిపోవచ్చని వార్తలు జోరుగా వచ్చాయి. అదిప్పుడు దాదాపు నిజం కాబోతోందని బాలీవుడ్ జనాలు అంటున్నారు. కొన్నాళ్ళుగా అక్షయ్ కుమార్- ట్వింకిల్‌తో ఇంట్లో కలిసి వుండకుండా ముంబాయి మారియట్ హోటల్లోనే మకాం పెట్టాడట. దీంతో వీళ్ల గొడవ ముదిరి పాకాన పడినట్టేనని చెబుతున్నారు. భార్యాభర్తలన్నాక ఏవో గొడవలొస్తాయి, కాస్త సర్దుకుపోతే సరి అని అనుకుంటే ఎంత బావుణ్ణు! చూద్దాం క్లయిమాక్స్ ఎలా వుంటుందో!

